అంతర్గత రోడ్లు అధ్వానం

- ఇప్పగూడెంలో బురదరోడ్లతో ప్రజల అవస్థలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న గ్రామమైన ఇప్పగూడెంలో సమస్యలు తిష్ట వేసినా ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఇప్పగూడెంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. పలు కాలనీల్లో సీసీ రోడ్ల సౌకర్యం లేక మట్టిరోడ్లు చిత్తడిగా తయారయ్యాయి. సీసీ రోడ్లు ఉన్న కాలనీల్లో సైతం పలు చోట్ల రోడ్లు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గుంతల్లో నీరు నిలిచి అధ్వానంగా మారాయి. తేలిక పాటి ముసురు వానలకే ప్రజలు రోడ్డు సమస్యతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్లు బురదమయంగా మారగా కనీసం కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. అదేవిధంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై నిలుస్తూ పందులు, దోమలకు నిలయంగా మారుతున్నాయి. గ్రామంలో పారిశుద్ధ్యం పడకేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. పేరుకే మేజర్ పంచాయతీగా ఉండగా సమస్యల్ని మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఇప్పగూడెంలో అధ్వానంగా ఉన్న 2వ వార్డు రోడ్డు


బురదమయంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డు

మెడికల్ సీట్లు సాధించిన ముగ్గురు విద్యార్థినులు


యమున


రిషిక

కొడకండ్ల: మండలకేంద్రంలోని టీజీఆర్‌ఎస్ బాలికల గురుకులంలో చదివిన జె.యమున గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. 2022–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యమున నీట్ ఎంట్రన్స్‌లో సత్తా చాటి ప్రఖ్యాతి గాంచిన గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించడంపై ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ అభినందించారు.

అంబేడ్కర్ నగర్‌కు చెందిన..

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కన్నారపు రజిత–నర్సయ్య దంపతుల పెద్ద కుమార్తె రిషిక దండిగల్‌లోని అరుంధతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. మెడిసిన్ సీటు సాధించిన రిషికను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

లింగాలఘణపురం: వనపర్తి పీవీఆర్ పాఠశాలలో పదో తరగతి చదివిన సింగారం అర్చన వరంగల్ ప్రతిమా మెడికల్ కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా శనివారం పాఠశాల యాజమాన్యం సన్మానించింది. కష్టపడి చదివి మెడికల్ సీటు సాధించిన అర్చన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని కరెస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

జఫర్‌గఢ్: బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో తిమ్మంపేట గ్రామ శివారులో దెబ్బతిన్న రోడ్డును నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ మాట్లాడుతూ తిమ్మంపేట గ్రామ శివారులో రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారినా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. మండల కేంద్రం మీదుగా ఖమ్మంకు వెళ్లే ప్రధాన రహదారి కూడా దెబ్బతిని గుంతలమయంగా మారిందన్నారు. దెబ్బతిన్న రోడ్లకు త్వరగా మరమ్మతు చేయలని ఆయన డిమాండ్ చేశారు. అరవింద్‌గౌడ్, స్వప్న, సంపత్‌గౌడ్ ఉన్నారు.

అర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

జనగామ: ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన సిద్దిపేట రోడ్డులోని గాయత్రి గార్డెన్‌లో సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగి శెట్టి ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన సంస్కృతికి అద్దం పట్టేవిధంగా తీర్చిదిద్దిన ఉత్తమ బతుకమ్మలకు మూడు సిల్వర్ బతుకమ్మ విగ్రహాలను బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. అలాగే తొమ్మిది మందికి కన్సోలేషన్‌గా చీరలను అందిస్తామన్నారు. సాంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పాటలు పాడిన వారితో పాటు తెలుగుదనం ఉట్టిపడేలా ఉన్న మహిళలకు బహుమతులు అందించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో పాల్గొనే వారు 9346459601, 9949295789, 9908821288 ఈ నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నియామకం



పాలకుర్తి టౌన్: షావోలిన్ కుంగ్‌ఫూ ది వరల్డ్ సంస్థ చీఫ్ ఆర్గనైజర్‌గా మండలంలోని లక్ష్మీనారాయణపురానికి చెందిన చీటూరు ప్రభాకర్ నియమితులయ్యారు. శనివారం హనుమకొండలోని డైమండ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఆ సంస్థ ఇండియన్ చీఫ్ ఎగ్జామినర్ సిఫు వేణుగోపాల్ యాదవ్ ప్రభాకర్‌ను ఆ సంస్థ చీఫ్ ఆర్గనైజర్‌గా సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కుంగ్‌ఫూ కళను మరింత మందికి చేరువ చేయడానికి కృషి చేస్తాన్నారు. సీనియర్ మాస్టర్లు శివరాజు, సాయి వినీత్, సమీర్, రమేశ్ పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా..


రాజు

తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మండలకేంద్రానికి చెందిన కొయ్యడ రాజు నియమితులయ్యారు. గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సోషల్ మీడియా సమావేశంలో మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి సూచన మేరకు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రావణ్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ చేతుల మీదుగా రాజు నియామక పత్రాన్ని అందుకున్నారు.

హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడిగా ఐలయ్య


ఐలయ్య

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన ఉద్యమ కారుడు బొంగు ఐలయ్య హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. హెడ్ వరల్డ్ సంస్థ చైర్మన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరకొండ సతీష్‌లు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ తన నియమానికి సహకరించిన చైర్మన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరకొండ సతీశ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చదువును ఇష్టపడుతూ చాలెంజ్‌గా తీసుకోండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి

జనగామ: విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుతూ జీవితాన్ని చాలెంజ్‌గా తీసుకుంటే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని అద్విత గ్లోబల్ ఈటీ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ వడ్డే నవీన్ అన్నారు. జనగామ మండలం యశ్వంతపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ పై నిర్వహించిన హకతాన్–2025 కార్యక్రమంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నవీన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం గురించి విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి చదువుకునే సమయంలో సమాజానికి ఉపయోగపడే కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు సమ జాన్ని చదివినప్పుడే కొత్త అవిష్కరణలకు ఆలోచన వస్తుందన్నారు. ఇందు కోసం ఈ హక్ తాన్–2025 సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలాజీ, జాన్, అచ్యుత్, రాధ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జనగామ: పట్టన నూతన సీఐగా సత్యనారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన మొదటి పోస్టింగ్ ములుగు జిల్లా వాజేడు నుంచి ఎస్సైగా తన ప్రస్తానం ప్రాంభించారు. అక్కడ నుంచి వెంకటాపురం, పాల్వంచ టౌన్, నేలకొండపల్లి, ఎస్సైగా పని చేసి, 2007లో సీఐగా పదోన్నతితో ఇంటలిజెన్స్ విభాగంలో బాధ్యతలను తీసుకున్నారు. భద్రాచలం టౌన్, ఖమ్మం రూరల్, చేర్యాల, సుబేదారి సీఐగా పని చేస్తూ టాస్క్ ఫోర్స్ విభాగానికి వెళ్లారు. ప్రస్తుత జనగామ సీఐ దామోదర్‌రెడ్డి బదిలీ కాగా, ఆయన స్థానంలో సత్య నారాయణరెడ్డి బాధ్యతలను స్వీకరించారు. దామోదర్‌రెడ్డి ఆయనకు బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సీఐని డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండేరీ చేతన్ నితిన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐకి స్టేషన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వ్యక్తి అరెస్ట్

కొడకండ్ల: పాకాల గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన రాచకొండ సాయికుమార్ లైంగిక వేధింపులకు పాల్పడుతుండటంతో శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. కొంత కాలంగా ఓ వివాహితను సాయికుమార్ లైంగిక వేధింపులకు పాల్పడుతుండటంతో తట్టుకొలేక ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఫిర్యాదు చేయగా విచారణ జరిపి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

'స్థానికం'లో సత్తా చాటాలి

దేవరుప్పుల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం నీర్మాల కాంగ్రెస్ క్లస్టర్ సమావేశంలో రామరాజుపల్లితో సహా పార్టీ శ్రేణులతో స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఇంటింటా నేరుగా అర్హులకు అందుతున్న సంక్షేమ ఫలాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, కొడకండ్ల మార్కెట్ చైర్‌పర్సన్ నల్ల అండాలు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్, బ్లాక్ అధ్యక్షురాలు తార, చింతల రవీందర్‌రెడ్డి, పురుషోత్తం కృష్ణ, పారుపెల్లి శ్రీనివాస్, కట్ట పరుశరాములు, రాజు, తుకారామ్ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు

బచ్చన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలను అందించడం జరుగుతుందని మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలో పలువురికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి



దేవరుప్పుల: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి మర్రి పట్టాభిరామిరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు మర్రి పాపిరెడ్డి జ్ఞాపకార్థం రూ.40 వేల విలువతో కూడిన క్రీడా యూనిఫామ్‌లను ఆయన అందించారు. హెచ్ఎం విష్ణువర్ధన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోలి చిన్న ఉప్పల్ రెడ్డి, ప్రతినిధులు బూత్కూర్ అశోక్ రెడ్డి, ఈదునూరి రామచంద్రారెడ్డి, నర్సింహారెడ్డి,పెద్ద ఉప్పల్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



చిల్పూరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సముద్రాల శ్రీదేవి అన్నారు. లింగంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులను అందజేశారు.

వైద్యశిబిరం



తరిగొప్పుల: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని సేవా పక్షంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మెడికోవర్, శరత్ ఐ కేర్ సహకారంతో శనివారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు సోడ రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి కంటి, వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమా రాణి, మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య, శశిధర్ రెడ్డి, నాయకుల తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

దేవరుప్పుల: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్య చేకూరుతుందని యూబీఐ దేవరుప్పుల మేనేజర్ తరుణ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం వద్ద తాగునీటి, శానిటేషన్, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ఆదేశానుసారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా యూబీఐ అధికారులు, సిబ్బంది శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగించి డోజర్‌తో చదును చేశారు. మండల వైద్యాధికారి రవితేజ, విడ్స్ ఫైనాన్సియల్ లిటరసీ సీసీ సంతోష్, కౌన్సెలర్స్ పసులాది ప్రశాంత్, బీరెల్లి రవివర్మ ,పాము స్వాతి, యుబీఐ ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా'

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్‌బీఐ శివునిపల్లి ఆధ్వర్యంలో మండలంలోని నమిలిగొండ గ్రామశివారులోని ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ గుగులోత్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది నీల రాకేష్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మమతాబాయి అన్నారు. శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. జీపీ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత



బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన బండెల రమేశ్ ఇటీవల మృతి చెందాడు. కాగా, ఆయతో కలిసి 2002 ఎస్ఎస్‌సీలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ. 15వేల సాయాన్ని శనివారం అందజేశారు. అలాగే సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5 వేలను అందించారు. నర్సయ్య, లక్ష్మీపతి, అశోక్, కుమారస్వామి, ఆదినారాయణ, ప్రశాంత్, నాగరాజు, బాలకిషన్, శంకరయ్య, సిద్దిరాములు, భరత్, శ్రీనివాస్ , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీలు నెరవేర్చాలి

దేవరుప్పుల: ఆసరా పింఛన్‌దారుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరమే నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామినాయక్ డిమాండ్ చేశారు. శనివారం ధరావత్‌తండా గ్రామ కార్యదర్శికి వికలాంగులు, వితంతవులు, వృద్ధులు తదితర ఆసరా లబ్ధిదారులకు ఫింఛన్ పెంచుతూ అర్హులకు మంజూరు చేయాలని ధర్నా చేపట్టి వినతి పత్రం గ్రామకార్యదర్శికి అందజేశారు.

పాలకుర్తి: పింఛన్లు పెంచాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆధ్వర్యంలో గూడూరు, బమ్మెర గ్రామ పంచాయతి కార్యదర్శులకు వినతిపత్రాన్ని అందజేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు తక్షణమే పింఛన్లు పెంచాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్, మండల ఇన్‌చార్జ్ గాదె శ్రీధర్ అన్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.

పంచాయతీ కార్యదర్శికి వినతి

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని కోరుతూ శనివారం మండలంలోని నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శికి వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, రూ.4వేలు, రూ.6వేల పింఛన్ పెంచే వరకు పోరాడుతామని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నగేశ్ అన్నారు. నరేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం

తరిగొప్పుల: మండల పరిధిలోని అబ్దుల్‌నాగారం, అంకుషాపూర్, బొంతగట్టునాగారం, నర్సాపూర్, అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. సాల్వాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ టీచర శ్రీలక్ష్మి, ఏఎన్ఎం స్వాతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ధర్మగడ్డతండాలో..

దేవరుప్పుల: మండలంలోని ధర్మగడ్డతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నల్ల స్వరూపరాణి ఆధ్వర్యంలో పౌష్టికాహారం, శిశువు అభ్యున్నతికి తల్లుల పాత్ర, సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, చేతుల పరిశుభ్రత ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ సునిత, హెచ్ఎం వరప్రసాద్,ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

ప్లేట్ల పంపిణీ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టి.రాకేశ్ సహకారంతో 100 ప్లేట్లను శనివారం ఎంఈఓ పోతుగంటి నర్సయ్య పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కోశాధికారి ఒర్రె కుమారస్వామి, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రికుటాలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయాల సందర్శన

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం గ్రామంలోని ముప్పేశ్వర త్రికుటాలయం, లక్ష్మీనృసింస్వామి ఆలయాలు, మండపం, శ్రీ పరివార్ మోగా ఆశ్రమాలను సందర్శించారు. కాకతీయుల కాలం నాటి చారిత్రాత్మకమైన త్రికుటాలయాన్ని ఆసక్తిగా తిలకించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆలయాల గొప్పతనం, చారిత్రక స్థలాల విశేషాలు పిల్లలకు క్లుప్తంగా వివరించారు.

చిల్పూరు ఆలయంలో వార కల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వార కల్యాణం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, సూపరింటెండెంట్ వెంకటయ్య, ధర్మకర్తలు గణగోని రమేష్, గోలి రాజశేఖర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శివునిపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గౌరిశెట్టి అనిల్, కోతి వేణు అన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఆర్య దంపతుల జన్మదినం సందర్భంగా క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం పండ్ల మొక్కలను నాటారు.

ఫిర్యాదు

బచ్చన్నపేట: తమ భూమికి రక్షణ లేకుండా పోయిందని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుర్రాల లలిత వాపోయారు. శనివారం బాధితుడు మాట్లాడుతూ గ్రామంలో 4.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుని 14 సంవత్సరాలుగా సేద్యం చేస్తున్నామని అన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు వచ్చి బోరు, మోటర్లు ధ్వంసం చేసి పంటలను కూడా నాశనం చేసినారని అన్నారు. అధికారులు తమ సమస్యపై నిర్లక్ష్యంగా వహిస్తున్నారని, ఈ విషయమై లోకాయుక్తలో ఫిర్యాదు చేశానని తెలిపారు.

విద్యార్థులకు అతిథి భోజనం

పాలకుర్తి: వావిలాల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గంట శ్యామ్ ఆధ్వర్యంలో అతిథి భోజనం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ పోతుగంటి నర్సయ్య తెలిపారు. విద్యార్థులకు చికెన్‌తో కూడిన భోజనం వడ్డించామన్నారు. రాణి, యాకుబ్ రెడ్డి, మల్లయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన

తరిగొప్పుల: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం అక్కరాజుపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రత్న ఆధ్వర్యంలో తడి, పొడిచెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.మన చుటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. మంచినీళ్ల హరిప్రసాద్, హరిప్రసాద్, కారోబార్ అక్తర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మోసాలు చేయడంలో శ్రీహరి ఐకాన్


మాట్లాడుతున్న రాజయ్య

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మోసాలు చేయడం, పార్టీలు మారడం, రాజకీయాల్లో కుట్రలు, కుతంత్రాలు చేయడం, అవినీతిలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఐకాన్ అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత డాక్టర్ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కడియం శ్రీహరిపై ఫైర్ అయ్యారు. ముందుగా కడియం శ్రీహరి అభివృద్ధిపై విడుదల చేసిన కాపీల పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం రాజయ్య మాట్లాడారు. దేవాదుల ద్వారా పంటలకు సాగునీరు అందక, యూరియా దొరకక రైతులు అరిగోస పడుతుంటే ఎమ్మెల్యే కడియం గత 15 రోజులుగా కనిపించకుండా పరారై ఈనెల 19న హనుమకొండలో తేలిండని ఎద్దేవా చేశారు. ఘన్‌పూర్‌లో ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేకనే హనుకొండలో ప్రెస్‌మీట్ పెట్టాడని విమర్శించారు. తెలంగాణలో పార్టీ ఫిరాయింపులే జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం కడియం పరిస్థితి తేలుకుట్టిన దొంగలా, కుడిదిలో పడ్డ ఎలుకలా ఉందని, చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జనగామ పట్టణం సూర్యాపేట రోడ్డు ఎస్పీఆర్ స్కూల్‌లో కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ప్రమోద్ రెడ్డి, శోభ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. దేవరుప్పులలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంటు బ్రదర్ జేసురాజు ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ బతుకమ్మతో ప్రదర్శన నిర్వహించారు.


జనగామ: బతుకమ్మ ఆడుతున్న ఎస్పీఆర్ విద్యార్థులు, ఉపాధ్యాయినులు


జనగామ: వీవర్స్ కాలనీ పీఎస్‌లో..



పాలకుర్తి: చెన్నూరు పాఠశాలలో..


జనగామ: ఎస్పీఆర్ స్కూల్‌లో కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ ఆధ్వర్యంలో..



జనగామ: రైల్వేస్టేషన్ ప్రభుత్వ పాఠశాలలో..


జనగామ: నర్మెట మండలం మాన్‌సింగ్ తండా పీఎస్‌లో..


జనగామ: హైదరాబాద్‌రోడ్డు ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో సెక్రటరీ చిర్ర ఉపేందర్‌రెడి, ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినులు


దేవరుప్పుల: భారీ బతుకమ్మలతో ప్రదర్శన నిర్వహిస్తున్న బాలయేసు విద్యార్థులు


జనగామ: చివరి రోజు బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు


జనగామ రూరల్: సెయింట్ మేరీస్‌లో..


జనగామ: నెహ్రూపార్కు ఏరియా సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న హెచ్ఎం మరియ జోసఫ్